క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఖాద్రి కిస్తీ



ప్రసాదం ఊరేగింపు కార్యక్రమంలో దర్గా పీఠాధిపతులు, భక్తులు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రి కిస్తీ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉరుసు సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలో మొదట దర్గా పీఠాధిపతులు నజరుల్లాషా ఖాద్రి దర్గాలో ప్రత్యేక ఫాతేహలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, డప్పుల మధ్య గురువుల వారి స్వగృహం నుంచి ట్రాక్టర్‌పై అన్నప్రసాదాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాకు తీసుకెళ్లి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి తొక్కిసలాట జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన గురువులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోరుకల్లుకు మరమ్మతులు



గోరుకల్లు జలాశయ బండ్‌పై మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

పాణ్యం: గోరుకల్లు జలాశయ నిర్వహణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జలాశయ బండ్‌పై కంపచెట్లు పెరగడంతో పాటు కట్టకు నెర్రెలివ్వడంతో ఇటీవల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం రూ.25 లక్షలు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు ఈఈ శుభకుమార్ తెలిపారు. ప్రస్తుతం నీటి కట్ట పటిష్టత పనులు ముమ్మరం చేసినట్లు చెప్పారు మాజీ జెట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, కొండజుటూరు సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి, గోరుకల్లు సర్పంచ్ ఉసేన్‌సా, ఇంజినీర్లు శుక్రవారం పనులను పరిశీలించారు.

వేసవి దుక్కులు ప్రారంభించండి



పంటల సాగుపై రైతులకు సూచనలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వచ్చే ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు వేసవి దుక్కులను మొదలుపెట్టాలని మండల వ్యవసాయాధికారి రవి ప్రకాష్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గోరంట్ల, లద్దగిరి, ముడుమలగుర్తి గ్రామాల్లో ఉన్న రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. వాటిలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో స్థానిక రైతులతో సమావేశమై పంటల సాగు, దిగుబడులపై చర్చించారు. పంట సాగుకు ముందు పొలాలను భూసార పరీక్షలు చేయించి పొలాల్లో పోషకాలను సరిచేసుకోవాలన్నారు. పొలంలో మిగిలిన పంట అవశేషాలను గెట్ల మీద వేసి కాల్చి వేయాలని, గొర్రెలు, పశువుల ఎరువులను పొలాల్లో చల్లుకోవాలన్నారు. మొక్కజొన్న, వేరుశనగ ఉత్పత్తులను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందన్నారు. ఆయా పంటలు సాగు చేసిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

టెంకాయల వేలం వాయిదా

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీమాధవస్వామి ఆలయ ఆవరణలో ఏడాది పాటు టెంకాయలు అమ్ముకునేందుకు శుక్రవారం వేలం నిర్వహించారు. అయితే, పాట పాడేందుకు పాటదారులు పోటీ పడకపోవడంతో ఈఓ గుర్రెడ్డి వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు బాలక్రిష్ణ, ఆలయ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, గ్రామ పెద్దలు, దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

సి.బెళగల్: ప్రజలు తమ నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో పర్యటించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నివాస స్థలాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. లేకపోతే వ్యాధులు దరిచేరే అవకాశం ఉంటుందన్నారు.



డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ సందీప్



మద్దూరు ప్రభుత్వ ఉన్న పాఠశాల ఆవరణలో పదోతరగతి విద్యార్థులను చదివిస్తున్న దృశ్యం

టార్గెట్ 100 %

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ కసరత్తు


- ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రభుత్వ పాఠశాలల్లో పది చదువుతున్న విద్యార్థులు 2,953 మంది

పాణ్యం: పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంపై విద్యాశాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 1 నుంచి పాఠశాలల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు చదివిస్తోంది. వారం వారం రివిజన్ టెస్టులు నిర్వహిస్తూ వారి విద్యా సామర్థ్యాన్ని అంచనా వేస్తోంది. పాణ్యం నియోజకవర్గంలో 44 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 2, 953 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఇందులో 1,388 బాలురు, 1,565 మంది బాలికలు ఉన్నారు. వీరందరికీ వచ్చే ఏప్రిల్ 3 తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రోజుకు రెండు గంటలు అదనంగా కేటాయించి సులభరీతిలో విద్యాబోధన చేస్తూ, వీక్లి టెస్టులు నిర్వహిస్తున్నారు. ఈ టెస్టులలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థి విద్యా సమర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. 'డి' గ్రేడ్‌లో ఉన్న వారిని 'సి' గ్రేడ్‌లోకి, 'సి' లో ఉండేవారిని 'బి'కి, 'బి'లో ఉండేవారిని 'ఎ' గ్రేడ్‌లోకి వెళ్లేలా తీర్చిదిద్దుతున్నారు. ఎందుకంటే గతేడాది నియోజకవర్గంలో వివిధ కారణాలతో చాలా తక్కువ మంది పాస్ అయ్యారు. గడివేముల మండలంలో 34.77, కల్లూరు 38.21, ఓర్వకల్లు 39.07, పాణ్యం 52.83 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఈనేపథ్యంలో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తరగతుల ద్వారా కసరత్తు చేస్తున్నారు.

పోటీతత్వం పెంచుతున్నాం



పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. దీంతో పాటు వారానికి ఒక సారి పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు గ్రేడ్‌లను తెలియజేస్తున్నాం. దీని వలన విద్యార్థుల మధ్య పోటీ తత్వం పెరుగుతుంది. బాగా చదువుకావాలని ఉత్సాహం కలుగుతోంది. దీంతో చాలా మంది మంచి మార్కులు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 2021-22 విద్యాసంవత్సరం కంటే ప్రస్తుతం విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– శ్రీనివాసులు, ఎంఈఓ, కల్లూరు

నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, పదో తరగతి విద్యార్థుల సంఖ్య

మండలం	పాఠశాలల	బాలురు	బాలికలు
పాణ్యం	13	202	324
కల్లూరు	12	550	690
ఓర్వకల్లు	13	458	339
గడివేముల	06	178	212

పరీక్షలపై భయం వీడండి



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు పోకల సుబ్బారెడ్డి

గూడూరు: పదవ తరగతి పరీక్షల పట్ల విద్యార్థులు భయం వీడి ఆత్మ విశ్వాసంతో వెళ్లాని వ్యక్తిత్వ వికాస నిపుణుడు పోకల సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో ఉప విద్యాధికారి హనుమంతురావు అధ్యక్షతన పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికారాదన్నారు. అప్పుడే సులభంగా పరీక్షలు రాయగలుగుతారన్నారు. జీవితంలో ఎదిగేందుకు ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యమని, దీనిని ఇప్పటి నుంచే అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సునీలమ్మ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఏపీ మోడల్ స్కూలు, జెడ్పీ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్సిపాల్ రామన్

పాణ్యం: ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామన్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదోతరగతి పాస్ అయిన విద్యార్థులు, ఇంటర్ మధ్య మానేసిన వారు ఓపెన్ ఇంటర్ చేసేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫొటోలు జత చేయాలన్నారు.

గణాంకాలపై అవగాహన



విజేతలకు జ్ఞాపిక బహూకరిస్తున్న ప్రిన్సిపాల్ శాంత

కర్నూలు కల్చరల్: గణాంక శాస్త్ర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పలు ఉపాధి అవకాశాలు ఉన్నాయని నేషనల్ శాంపిల్ సర్వే శాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారి ఎ.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు సూచించారు. శుక్రవారం కర్నూలు నగరంలోని స్థానిక సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారిక గణాంకాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాల విద్యార్థినులు బి.అనిత, పి.సుగుణ కుమారి, ఆర్.నీలిమ, రమ్య, వి.దివ్య, కె.మల్లేష్ గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతి సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎ.జమినా జకోబ్, కె.నాగసాయి మృదుల, వై.దీపిక, కె.సాయికృష్ణ, ఎస్.తాజుద్దీన్‌లు, తృతీయ బహుమతి శంకరాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కె.వినోద్‌కుమార్, డి.దామోదర్‌రెడ్డి, బి.సుధీర్ గౌడ్, ఎస్.ఫయాజ్ అహ్మద్, కె.శ్రీమన్ కుమార్ గెలుచుకున్నారు. పాల్గొన్న మిగతా కళాశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అవగాహన సదస్సులో సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శాంత, కళాశాల స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి ఐ.కల్యాణి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు కల్చరల్: నేషనల్ హైవేలపై (ఎన్‌హెచ్) ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్ వద్ద అండర్ పాస్‌నిర్మాణానికి సంబంధించి డిజైన్స్ ఎస్టిమేషన్స్ పనులు, సంతోష్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద ఐరన్ బ్యారికేడింగ్ పనులు, ఫ్లైఓవర్ మధ్యలో టూవీలర్స్ ప్రవేశించకుండా చేయాల్సిన పనులు, సంతోష్‌నగర్ నుంచి మానస డాబా వరకు సోలార్ లైట్స్ ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బళ్లారి చౌరస్తా ప్రాంతంలో రహదారుల విస్తరణ పనుల టీడీఆర్ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఆరా తీశారు. నగరంలో సీసీ కెమెరాల మరమ్మతులు త్వరగా చేయాలని ఆదేశించారు. ఐఆర్ఏడీకి సంబంధించి ఈడీఏఆర్‌గా మార్పు చేయడం జరిగిందని, ప్రమాదాలకు గురైన వారిని ఆరోగ్యశ్రీ కింద సేవలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ప్రయాణికులు ఎవరైనా ప్రమాదానికి గురైన కూడా ఆరోగ్యశ్రీ కార్డు లేకున్నా వారికి అత్యవసర వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. నగరంలో ప్రస్తుతం పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులు మాత్రమే తిరగడానికి అనుమతి ఇచ్చామన్నారు. సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, ఆర్టీవో రమేష్, ఆర్టీసీ, మున్సిపల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీ

క్రైమ్ కార్నర్

కర్నూలు: కర్నూలు శివారులోని రేడియో స్టేషన్ సమీపంలోని హోసన్నా మందిర్ వద్ద ఆటో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. తమిళనాడుకు చెందిన లారీ కోడుమూరు వైపు నుంచి కర్నూలుకు వస్తుండగా కల్లూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ వినోద్ కర్నూలు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ వినోద్‌ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్, క్లీనర్ వాహనాన్ని వదిలి పరారయ్యారు. దీంతో పోలీసులు లారీని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కర్నూలు కల్చరల్: బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని డీఎస్‌వో రాజా రఘువీర్, అర్బన్ ఏఎస్‌వో రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డిల గూడూరు మండలం పెంచికలపాడు వద్ద శుక్రవారం పట్టుకున్నారు. ఏపీ 21 టీవై 7959 నంబర్ ఆటోలో సుమారు ఎనిమిది క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



స్పోర్ట్స్ సమాచారం

ఓర్వకల్లు.. కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో శకునాల జట్టు విజయం సాధించింది. సయ్యద్ మహమూద్‌షా ఖాద్రి ఉరుసు సందర్భంగా గురువారం రాత్రి నిర్వంచిన ఈ పోటీలలో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. ఇందులో శకునాల జట్టు మొదటి స్థానంలో గెలుపొందగా రూ.15 వేలు, ప్యాపిలి జట్టు రెండవ స్థానంలో గెలుపొందగా రూ.10 వేలు, కర్నూలు స్టేడియం జట్టు మూడో స్థానంలో నిలువగా రూ.5 వేలు, ఎన్ కొంతలపాడు జట్టు నాలుగో స్థానంలో నిలవగా రూ.3 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలకు చంద్రపాల్, క్రిష్టఫార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కర్నూలు (న్యూటౌన్): పంచలింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో సత్తాచాటారు. ఇటీవల విజయనగరం జిల్లాలోని అలుగోలులో అండర్-17 విభాగంలో పోటీలు జరిగాయి. ఇందులో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పంచలింగాల జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం ఓంకార్ యాదవ్ తెలిపారు. అలాగే సెపక్‌తక్రా అండర్ -14 విభాగంలో కవితాబాయి, పూజిత ఎంపికై నట్లు వెల్లడించారు. వీరిని శుక్రవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు అభినందించారు.

పకడ్బందీగా ఆయుష్మాన్ భారత్ సర్వే



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కల్లూరు: ఆయుష్మాన్ భారత్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ/వార్డు సచివాలయాల కర్నూలు డివిజన్ అభివృద్ధి అధికారి పి.బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళ పోలీసులతో సచివాలయ సేవలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన వారందరికీ ఆయుష్మాన్ కార్డు అందించాలన్నారు. దీని వల్ల ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునన్నారు. అలాగే 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు, 6 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారి ఆధార్ కార్డులను అప్‌డెట్ చేయాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వేను అన్ని సచివాలయలు తప్పనిసరిగా పూర్తి చేయలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవి కిషోర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శరవేగంగా భూ రీ సర్వే

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే శరవేగంగా సాగుతున్నట్లు కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భూవివాదాల పరిష్కారానికి ప్రభుత్వం సర్వే చేస్తుందన్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, సర్వే పూర్తయ్యాక రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు అందజేస్తామని అన్నారు. ఇప్పటికే ఆధునిక డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. వాటిని ట్యాంపరింగ్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. శుక్రవారం నాటికి మండలంలోని అన్ని గ్రామాల్లో 68,492.86 ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: మండల పరిధిలోని సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. శుక్రవారం 460 క్యూసెక్కుల నీరు డ్యాంకు రాగా కేసీ కాల్వకు 602 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 0.554 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

గృహాలు నిర్మించుకోండి

గూడూరు రూరల్: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరగా గృహాలు నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ జమ్మన్న అన్నారు. కె.నాగలాపురంలో లబ్ధిదారులు చేపట్టిన ఇంటి నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో 87 మంది ఇళ్లను నిర్మించుకుంటున్నారన్నారు. కొందరివి ఇప్పటికే నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన వారివి వచ్చే నెల చివరిలోపు 50 శాతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంటు, స్టీల్ అందిస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నష్టపరిహారమివ్వాలని నిరసన

గడివేముల: బిలకలగూడూరు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు నష్టపరిహారం అందించకుండా పొలాలను అక్రమించడం సరికాదని ఏపీ రైతు సంఘం నాయకులు రామచంద్రుడు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ అన్నారు. వెంటనే బాధిత రైతులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు రైతులతో కలిసి జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

టైలర్స్ డేను జయప్రదం చేయండి



టైలర్స్ డే పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): టైలర్స్ డే వేడుకలను ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఖలీల్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక పాతబస్తీలోని ఉర్దూ ఘర్‌లో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టు మిషన్ రూపకర్త విలియమ్స్ హూ జయంతిని పురస్కరించుకొని టైలర్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు, పెద్ద పెద్ద మాల్స్ వచ్చాక టైలర్ల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ మోహన్‌రెడ్డి టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక తోడ్పాడు అందించడం అభినందనీయమన్నారు. షాపుల్లో పనిచేసే, ఇళ్లలో పనిచేసుకునే మహిళా టైలర్లకు సైతం పథకాన్ని వర్తింజేయాలని కోరారు. 28న జరిగే టైలర్స్ డే కార్యక్రమానికి కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్‌ఖాన్‌తో పాటు నగర మేయర్ బీవై రామయ్య, ఇతర ప్రముఖులు హాజరవుతున్నారని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్లు విడుదల చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ఫరూక్, నేషనల్ బాషా, బెనర్జీ, వేణుగోపాల్, నరసింహులు, రామకృష్ణ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తి తీరేలా..!

- కర్నూలు నగరంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు
- సమస్య ఉత్పన్నమయ్యే కాలనీల గుర్తింపు
- ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అధికారుల నిర్ణయం
- సుంకేసుల, జీడీపీలలో నీటి నిల్వలు



నిండుగా ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

కర్నూలు (టౌన్): వేసవిలో కర్నూలు నగరంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా నగరపాలక అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. నగరంలో మూడు నియోజకవర్గాలు విలీనమయ్యాయి. కర్నూలు నియోజకవర్గంలో 33 వార్డులు, పాణ్యం అర్బన్‌లో 16 వార్డులు, కోడుమూరు అర్బన్ నియోజకవర్గంలో 3 వార్డులు ఉన్నాయి. ఇటీవల పందిపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం గ్రామాలు విలీనమయ్యాయి. వేసవిలో నగరంలో పెద్దపాటు, పందిపాడుతోపాటు 23 కాలనీలలో తాగునీటి సమస్య వస్తుందని అధికారులు గుర్తించారు. స్టాంటన్‌పురం, సోనియాగాంధీనగర్, అంబేద్కర్‌నగర్, సమతానగర్, మమతానగర్, గీతా ముఖర్జీనగర్, ధనలక్ష్మీనగర్, సోమిశెట్టి కాలనీ తదితర కాలనీలను గుర్తించారు. ఆయా కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా ఆయా వార్డుల పరిధిలో చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయడంతోపాటు స్థానికంగా నీటి ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు.

రూ.59.67 లక్షల బడ్జెట్ కేటాయింపు

నగర ప్రజలకు వేసవి దాహార్తి తీర్చేందుకు నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించారు. వచ్చే మార్చి, ఏప్రిల్, మే నెలలను పరిగణలోకి తీసుకొని రూ. 59.67 లక్షలు బడ్జెట్ కేటాయించారు. పాణ్యం అర్బన్ పరిధిలోని వార్డులకు రూ.9.98 లక్షలు, కర్నూలు నియోజకవర్గ ప్రజల కోసం రూ.9.98 లక్షలు, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లోని కాలనీలలో నీటి సరఫరా కోసం రూ.9.98 లక్షలు కేటాయించారు. అలాగే 1.00 హెచ్‌పీ, 1.05 హెచ్‌పీ, సబ్ మెర్సిబుల్ పంపుసెట్లు, పానెల్ బోర్డ్స్, కేబుల్స్ ఏర్పాటు చేయడం తదితర వాటికోసం రూ.9.98 లక్షలు, హిటాచీ, 140 కేపాసిటీ జేసీబీ, ట్రాక్టర్స్, లేబర్స్ ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం మరో రూ.9.97లక్షలు కేటాయించారు. ఈ నిధులు వెచ్చించి వేసవిలో కర్నూలు ప్రజలకు తాగునీటి ఇక్కట్లు రాకుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 4,300 ఎంఎల్ నీరు

కర్నూలు నగరంలో 5.50 లక్షల జనాభా ఉన్నారు. అయితే నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు సుంకేసుల, జీడీపీలలో నీటిని నిల్వ ఉంచారు. సుంకేసులలో 1.110 టీఎంసీల నీరు, అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)లో 2.60 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు. ఇక నగర శివారులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీటి నిల్వ సామర్థ్యం 4,410 ఎంఎల్ కాగా ప్రస్తుతం 4,300 ఎంఎల్ నీరు ఉన్నట్లు నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు.

రూ.82 కోట్లతో పైప్‌లైన్ పనులు

సుంకేసుల నుంచి వచ్చే నీటిని కర్నూలు నగర వాసులు వినియోగిస్తున్నారు. అయితే అక్కడి నుంచి మునగాలపాడు పంపింగ్ స్టేషన్‌కు నీరు చేరుకోవాలంటే 23 కి.మీ ప్రయాణం చేయాల్సి ఉంది. సుంకేసుల నుంచి ఓపెన్ చానల్ ద్వారా నీటిని సరఫరా చేయడం వల్ల మధ్యలో నీటి ఆవిరితో పాటు పెద్ద ఎత్తున్న నీటి చౌర్యం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కరించేందుకు ఆరు నెలల క్రితం రూ.82 కోట్లతో సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. అదేవిధంగా మునగాలపాడు పంపింగ్ స్టేషన్ ప్రాంగణంలోనే 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటు పనులు 70 శాతం పూర్తి అయ్యాయి.



మునగాలపాడు వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ పనుల దృశ్యం

తాగునీటి సమస్య తలెత్తనివ్వం



వచ్చే వేసవి కాలంలో నగర ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాం. శివారు కాలనీలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం. నీటి ఇబ్బందులు ఉంటే నగరపాలక కార్యాలయంలోనే టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తాం. కాలనీవాసులు కోరిన మీదట అక్కడకు నీటి ట్యాంకర్ పంపిస్తాం. ఇప్పటికే 75 ఎంఎల్‌డీ నీటిని శుద్ధిచేసి పట్టణ ప్రజలకు అందిస్తున్నాం. మార్చి నెలాఖరు నాటికి మరోక వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంటు పనులు పూర్తి అవుతాయి. దీని ద్వారా అదనంగా 1.50 లక్షల మందికి నీటిని అందిస్తాం.

–భార్గవ్‌తేజ, నగరపాలక కమిషనర్